# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వక్ఫ్ చట్ట సవరణ బిల్లు 2025ను పై రాజ్యసభలో ఈరోజు చర్చ జరగనుంది.**
2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది.**
3. **మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**
4. **పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు.**
5. **విద్యార్థులకు ఒంటిపూట బడులను ఖచ్చితంగా నిర్వహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కె. అప్పారావు స్పష్టం చేశారు.**

==========================

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు 2025ను పై రాజ్యసభలో ఈరోజు చర్చ జరుగనుంది. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ, లోక్‌సభ ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యసభకు వచ్చిందని చెప్పారు. ఈరోజు రాజ్యసభలో వక్ఫ్‌బిల్లుపై చర్చ జరుగుతుందని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

కాగా నిన్న 12 గంటల సుదీర్ఘ చర్చ అనంతరం లోక్ సభ.. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. 288 మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా, 232 మంది బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కొనసాగుతోంది. ఈ సమావేశంలో డ్రోన్ పాలసీపై మంత్రి వర్గం చర్చిస్తోంది. డ్రోన్ పాలసీ విధి విధానాలను ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అలాగే రాజధాని అమరావతిలో పలు పనులకు ఆమోదంతో పాటు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలపై తీర్మానం చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా ఈ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి సింగపూర్ ప్రతినిధులతో సమావేశమై రాజధాని అభివృద్ధిపై చర్చించనున్నారు.

---------------------------

మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో 'మన ఇల్లు మన లోకేశ్ కార్యక్రమంలో 3 వేల మందికి శాశ్వత ఇళ్ల పట్టాలు మంత్రి ఈ రోజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛతలో మంగళగిరి దేశంలోనే మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో త్వరలోనే 100 పడకల ప్రభుత్వాసుపత్రిని ఏర్పాటు చేయనున్నామని నారా లోకేష్ పేర్కొంటూ,

వాయిస్..35 సెకన్లు

---------------------------

రాజధాని అమరావతి పనులను తిరిగి ప్రారంభించడంతో పాటు, పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ త్వరలో రాష్ట్రంలో పర్యటించనున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరంగా చేయాల్సిన పనుల ఏర్పాట్లపై నిన్న ఆయన అమరావతిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విజయానంద్ మాట్లాడుతూ, డీజీపీ, సీఆర్డీఏ అధికారులు, గుంటూరు జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు రాజధాని ప్రాంతాన్ని సందర్శించి సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. వివిధ పనుల నిర్వహణకు, మంత్రులు, అధికారులతో కమిటీలను వేయాలని సూచించారు.

---------------------------

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎడ్ల పోటీలు రైతులను, పశు పోషకులను ఉత్సాహపరిచేందుకు దోహదపడతాయని చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఒంగోలు జాతి ఎద్దులు ప్రసిద్ధి పొందాయని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..22 సెకన్లు

---------------------------

దిగుబడులు పెంచడమే లక్ష్యంగా వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధకు ప్రాధాన్యమిస్తున్నామని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ వెల్లడించారు. వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ –ఏపీఏఐఎం ఎస్ 2.0ను మంగళగిరిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిన్న ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఉపగ్రహ చిత్రాలు, శాస్త్ర సాం కేతిక నమూనాలు, వాతావరణ సంబంధిత సమాచారం వంటి డిజిటల్ సమాచార లభ్యత వ్యవసాయ రంగానికి ఒక చోదక శక్తిగా దోహదపడుతుందన్నారు.

---------------------------

పాఠశాల విద్యార్థులకు ఒంటిపూట బడులను ఖచ్చితంగా నిర్వహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కె. అప్పారావు తెలిపారు. శ్రీకాకుళంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నిబంధనలను

అతిక్రమించి పాఠశాల నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చేచేందుకు ఈగల్ డ్రగ్స్ కంట్రోల్, పోలీసు శాఖలు సంయుక్తంగా 'ఆపరేషన్ గరుడ' నిర్వహిస్తున్నాయని ఈగల్ ఐజీ ఏ.రవికృష్ణ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీసు శాఖ ప్రధాన కార్యాలయంలో మాదకద్రవ్యాల నియంత్రణపై ఔషధ డీలర్ల సంఘం ప్రతినిధులతో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవి కృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో నిబంధనలు అతిక్రమించినట్లు గుర్తించిన 158 ఔషధ దుకాణాలపై కేసులు నమోదు చేశామని చెప్పారు.

---------------------------

కేంద్రప్రభుత్వ ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ – ఏపీఎస్పీడిసిఎల్ శ్రీకాళహస్తి ఇన్చార్జ్ నాగేశ్వరరావు అన్నారు. శ్రీకాళహస్తిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకోవచ్చని అన్నారు. గత రెండు నెలల వ్యవధిలో సూర్య ఘర్ పథకం కోసం 17వేల 3వందల 86మంది ధరఖాస్తు చేసుకున్నారని తెలియజేస్తూ,

వాయిస్.. 36 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 23 సెకన్లు....

---------------------------

ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు. ప్రజల్లో వినికిడి లోపాన్ని నివారించి, శ్రవణేంద్రియం పట్ల జాగ్రత్తలు తీసుకునేలా చైతన్య పరిచేందుకు ప్రపంచ ఆరోగ్యసంస్థ 2007 నుంచి ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. "అందరికీ చెవి, వినికిడి సంరక్షణను వాస్తవంగా మార్చేందుకు శక్తివంతం కావడం" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది వినికిడి దినాన్ని నిర్వహిస్తున్నారు.

=====================